
పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న కలెక్టర్

పదో తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఏఎస్పీ

నిర్మల్‌కల్చరల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం పటిష్ట భద్రతల నడుమ ప్రారంభమయ్యాయి. కలెక్టర్ అభిలాష అభినవ్ నిర్మల్‌లోని రవి హైస్కూల్, సోన్ ఉన్నత పాఠశాల పరీక్షాకేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యార్థుల హాజరు, వారికిసౌకర్యాలు కల్పించారా లేదా అని ఆరాతీశారు. నిబంధనలకు అనుగుణంగా పరీక్షలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష పేపర్లను సకాలంలో తెరిచారా.. లేదా అని అధికారులను ప్రశ్నించారు. ఎలాంటి కాపీయింగ్‌కు తావులేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. మొబైల్, స్మార్ట్ వాచీ, ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రాల్లోకి తీసుకురాకుండా చూడాలన్నారు. పరీక్ష ముగిసిన తరువాత జవాబు పత్రాలను బందోబస్తు నడుమ నిర్దేశిత కేంద్రాలకు తరలించాలన్నారు. డీఈవో రామారావు, పరీక్షల సహా కమిషనర్ పరమేశ్వర్, తహసీల్దార్లు మల్లేష్, రాజు, ఇతర సిబ్బంది, కలెక్టర్ వెంట ఉన్నారు. అలాగే శ్రీమేధా హైస్కూల్‌లో బందోబస్తు ఏర్పాట్లను ఏఎస్పీ అవినాష్ కుమార్‌అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా చూడాలని ఆదేశించారు. కేంద్రాలపరిధిలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వవద్దన్నారు. 163 సెక్షన్ పకడ్బందీగా అమలుకు ఆదేశించారు.

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి: కలెక్టర్

నిర్మల్‌అర్బన్, మార్చి21(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులంతా క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఎంఏ అండ్ యూడీ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. జిల్లాలు, మున్సిపాలిటీల వారీగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ)కు దరఖాస్తు చేసుకున్న వారందరూ రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పలువురు దరఖాస్తుదారులంతా రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లిస్తున్నారని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పరిధిలో ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ రుసుములో 25శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. మార్చి 31తో రుసుము చెల్లించే గడువు ముగుస్తుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, యాదవ్‌కృష్ణ, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సెలక్షన్ లిస్ట్ విడుదల

నిర్మల్‌కల్చరల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ వెబ్‌సైట్‌లో జాతీయ ఆరోగ్యమిషన్ కార్యక్రమంలో ఎంపిక చేయబడిన కాంట్రాక్ట్ ఉద్యోగుల జాబితా నిర్మల్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు జిల్లా అధికారి రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్ నర్స్, డీపీవో, ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగుల మెరిట్ లిస్ట్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

వెంటాడుతున్న గడువు గండం!


• సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

• జిల్లాలో అభివృద్ధి పనులకు ఆటంకం • నిధుల కొరతతో ప్రగతి నిర్వీర్యం • నత్తనడకన ఎన్ఆర్ఈజీఎస్ పనులు
• ఆర్అండ్‌బీ పరిస్థితి దయనీయం • డబ్బుల్లేక సాగని ఇరిగేషన్ పనులు • వెంటాడుతున్న మార్చి 31

నిర్మల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి పనులకు గడువు గండం వెంటాడుతోంది. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మెటల్ రోడ్లతో పాటు బ్రిడ్జిలు, ఇరిగేషన్ శాఖ పరిధిలోని పనులకు ఓ వైపు గడువు గండంతో పాటు నిధుల కొరత సమస్యగా మారింది. మార్చి 31వ తేదీలోగా వివిధ ఇంజనీరింగ్ శాఖల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులన్నీ పూర్తి కావాలన్న నిబంధన ఉంది. గడువులోగా పనులు పూర్తికానట్లయితే.. మంజూరైన నిధులు వెనక్కి మళ్లిపోయే ప్రమాదం సైతం పొంచి ఉండడం సంబంధిత శాఖ అధికారులను ఆందోళనకు గురి చేస్తోంది. అయితే మంజూరవుతున్న పనులకు అవసరమయ్యే నిధులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం విడుదల చేయకపోతుండడం శాపంగా మారుతోంది. భారీగా కేటాయింపులు, మంజూరులు జరుగుతున్నా.. నిధుల విడుదల విషయంలోనే ప్రభుత్వం చేతులెత్తేస్తుండడం ఇబ్బందులకు కారణమవుతోంది. ప్రస్తుతం జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ కింద పంచాయతీ రాజ్ శాఖ చేపడుతున్న పనులకు మాత్రమే అంతో ఇంతో నిధులున్నప్పటికీ.. ఈ నిధులు విడుదల ఆలస్యమవ్వడంతో పనులన్నీ గడువులోగా పూర్తవ్వడం కష్టమేనంటున్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 1400 పనులను చేపట్టేందుకు ప్రభుత్వం రూ. 80 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీ భవనాలు చేపట్టారు. ప్రస్తుతం పనులన్నీ కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు రూ. 15 కోట్లకు సంబంధించిన పనులను మాత్రమే పూర్తి చేశారు. మార్చి 31వ తేదీలోగా రూ. 40 కోట్ల రూపాయలను వ్యయం చేయాల్సి ఉంది. మరో తొమ్మిది రోజుల్లోగా రూ. 40 కోట్ల పనులను ఎలా పూర్తి చేస్తారన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పనులు

ఇదిలాఉండగా జాతీయ గ్రామీణఉపాధిహామీ పథకం కింద జిల్లాకు 1400 పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే ఈ నిధులకు రాష్ట్రప్రభుత్వ భాగస్వామ్య నిధులు ఆలస్యంగా విడుదల కావడంతో పనుల్లో జాప్యం జరిగింది. మొదట రూ.80కోట్ల మంజూరు కాగా.. చాలాచోట్ల పనులు ఆలస్యంగా మొదలయ్యాయి. అలాగే మరికొన్నిచోట్ల కూడా ఈ పనుల నాణ్యత విషయంలో కూడా ఆరోపణలు వెల్లువెత్తడంతో.. పనుల్లో జాప్యం జరిగింది. ఇప్పటివరకు కేవలం రూ.15కోట్ల పనులను మాత్రమే పూర్తిచేశారు. అయితే నిబంధనల ప్రకారం మార్చి31వ తేదీలోగా రూ.55కోట్ల పనులను పూర్తిచేయాల్సి ఉంది. అయితే గడువు కేవలం 9రోజులు మాత్రమే ఉండడంతో.. అప్పటిలోగా రూ.40 కోట్ల పనులను ఎలా పూర్తి చేస్తారోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ నిధులు గడువులోగా ఖర్చు చేయకపోతే ఆ నిధులన్నీ వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. అధికారులు ముందస్తుగా దీనిపై దృష్టి సారించకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం సమస్య తీవ్రరూపం దాల్చింది. కేవలం 9రోజుల్లోగా రూ.40కోట్ల విలువైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాల పనులను ఎలా పూర్తి చేయగలుగుతారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నిర్వీర్యంగా మారిన ఆర్అండ్‌బీ శాఖ

గతంలో పెద్దమొత్తంలో నిధులు, అదేస్థాయిలో అభివృద్ధి పనులు నిర్వహించే రోడ్లు భవనాల శాఖ ప్రస్తుతం పూర్తిగా నీరుగారిపోయింది. ఆ శాఖకు గత పదేళ్ల నుంచి రాష్ట్రప్రభుత్వం సక్రమంగా నిధులు మంజూరు చేయకపోతుండడం.. అలాగే ఇక్కడి అధికారులు రూపొందించిన ప్రతిపాదనలు పట్టించుకోకపోవడంతో ఆ శాఖ క్రమంగా నిస్తేజం వైపు పయనిస్తోందంటున్నారు. ప్రతిపాదించిన పనులకు నిధులు మంజూరు కాకపోతుండడంతో అధికారులు ప్రతియేటా కొత్త ప్రతిపాదనలు రూపొందించడం.. వాటిని సర్కారుకు ప్రతిపాదించడానికే పరిమితమవుతున్నారు. ప్రస్తుతం గుండంపెల్లి రోడ్డు నిర్మాణ పనులు తప్పా.. మరే ఇతర పనులు కొనసాగడం లేదు. దీంతో పాటు ఆర్అండ్‌బీ శాఖకు ప్రతియేటా మంజూరయ్యే స్పెషల్ గ్రాంట్ నిధులు సైతం మంజూరుకాకపోతుండడం ఆ శాఖ నిర్వీర్యానికి కారణమవుతోందని అంటున్నారు.

ఇరిగేషన్‌దీ అదే పరిస్థితి

ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు ఎలాంటి గడువు లేనప్పటికీ.. ఆ శాఖకు కూడా నిధుల గుండం వెంటాడుతోంది. ఇప్పటికే జిల్లాలో పలు చెక్‌డ్యాంల నిర్మాణాలు, కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరైనప్పటికీ.. ఆ మంజూరైన నిధులు ఎప్పటికప్పుడు విడుదల కాకపోతుండడంతో పనులుముందుకు సాగడంలేదు. ఇప్పటికే జిల్లాలో అనేక చోట్ల నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. అయితే కొన్ని రాజకీయ కారణాలతో చెక్‌డ్యాంల నిర్మాణ పనులు అలాగే అటవీ శాఖ అనుమతులు లేని కారణంగా కాలువల నిర్మాణాల పనులు కొనసాగడం లేదు. ఇలా ప్రతియేటా జిల్లాలో ఆయా శాఖల కింద చేపట్టే అభివృద్ధి పనులకు ఇటు నిధుల కొరతతో పాటు పలు రాజకీయ సాంకేతిక, పరిపాలన పరమైన కారణాలు అడ్డంకిగా మారుతున్నాయి.

ఆరోగ్యంగా ఉంటేనే విధి నిర్వహణలో చురుకుదనం: ఎఫ్ఆర్‌వో


ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఖానాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధి నిర్వహణలో చురుకుదనంతో పనిచేయవచ్చని ఖానాపూర్ ఎఫ్ఆర్‌వో కిరణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో అటవీ శాఖ డివిజన్ కార్యాలయంలో ఉచితవైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఖానాపూర్‌రేంజ్ పరిధిలోని అటవీశాఖ ఉద్యోగులకు, సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో ఈసీజీ, 2డీ ఈకో లాంటి గుండె సంబంధిత పరీక్షలతోపాటు కంటి సంబంధిత పరీక్షలు, డయాబెటిస్ సంబంధిత పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు మెడికేర్ ఆసుపత్రి డాక్టర్ సాయికిరణ్‌రెడ్డి, కార్డియాలజిస్ట్ డాక్టర్ జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

• డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్‌రూరల్,మార్చి21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రఅభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామంలో రూ.20లక్షలతో సీసీ రోడ్ల పనులకు భూమిపూజచేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ నరేష్, మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్, నారా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ సమీపంలో ఆక్రమణల తొలగింపు

నిర్మల్‌కల్చరల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ బస్టాండ్ సమీపంలో ఆక్రమణలను శుక్రవారం ఏఎస్పీ రాజేష్ మీనా తొలగించారు. ఆటో డ్రైవర్లు రోడ్డు పైన ఆటోలు నిలిపి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని ఆదేశించారు. రోడ్డుస్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలుంటాయన్నారు.

నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పండరి

నిర్మల్‌అర్బన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ ఆర్టీసీడిపో మేనేజర్‌గా పండరి నియమితులయ్యారు. ఈయన మియాపూర్2 డిపోలో అసిస్టెంట్ ఇంజనీర్(ఎం)గా పనిచేసి పదోన్నతిపై నిర్మల్ డిపోకు వచ్చారు. డిపో మేనేజర్ పండరికి నిర్మల్ డిపో సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఇదివరకు డిపో మేనేజర్‌గా పని చేసిన ప్రతిమా రెడ్డి ఆదిలాబాద్ డిపోకు బదిలీపై వెళ్లారు.

అడవులు రక్షించుకోవడం మన బాధ్యత

కడెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అడవులను రక్షించుకోవడాన్ని మనందరి బాధ్యతని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. మండలంలోని ఉడుంపూర్ రేంజ్‌లో శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అటవీ అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అటవీ దినోత్సవం సందర్భంగా అడవుల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీ యూపీఎస్ పాఠశాలలో ప్రపంచ అటవీ దినోత్సవం సమావేశం నిర్వహించి, అడవుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కల్లెడ డీవైఆర్‌వో డి.ప్రకాష్, ఉడుంపూర్ ఎఫ్ఎస్‌వో ఆర్. వసంత్, రాంపూర్ ఎఫ్ఎస్‌వో వి. సరిత, ఎఫ్ఎస్‌వో పాండురంగ్, తదితరులు, గ్రామస్థులున్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలు దూరం

భైంసా: మార్చి21 (ఆంధ్రజ్యోతి): అనుపత్రుల నిర్వాహణ సిబ్బంది అన్నివేళల జాగ్రత్త చర్యలు పాటిస్తూ అప్రమత్తతతో వ్యవహరిస్తే అగ్ని ప్రమాదాలకు అవకాశముండదని భైంసా ఫైర్‌ఆఫీసర్ రవి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులలో అగ్ని ప్రమాద నివారణ చర్యలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. అగ్నిమాపక శాఖ నిబంధనలకు అనుగుణంగా ప్రమాదాల నివారణకు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలకు గల కారణాలు, వాటి నివారణ చర్యలు, పాటించాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై నిర్వహణ సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఇందులో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

నడవలేని సాక్షి వద్దకే
కదిలొచ్చిన న్యాయాధికారి

• కాలు విరగడంతో కోర్టులోకి వెళ్లేందుకు ఇబ్బంది పడిన సాక్షి • ఆటో వద్దకే వచ్చి వివరాల సేకరణ

ఖానాపూర్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): సాక్ష్యం చెప్పేందుకు వచ్చి నడవలేని స్థితిలో ఉన్న ఓ సాక్షి నుంచి వివరాలు సేకరించేందుకు స్వయంగా న్యాయాధికారే కదిలొచ్చారు. శుక్రవారం ఉదయం ఖానాపూర్ కోర్టులో ఓ కేసు విచారణ సాగుతోంది. ఈ సమయంలో సాక్షిని కోర్టులో ప్రవేశపెట్టాల్సిన సమయం వచ్చింది. ఈ కేసు విషయంలో సాక్ష్యం చెప్పేందుకు కనక కిషన్ అనే వ్యక్తి కోర్టు వద్దకు ఆటోలో వచ్చాడు. ఆటోలో వచ్చిన సాక్షికి ఇటీవల కాలు విరగడంతో అతను నడవలేని పరిస్థితిలో అక్కడే ఉండిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన కోర్టు డ్యూటీలో ఉన్న పోలీసులు, సిబ్బంది మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మరుక్షణమే సాక్షి నుంచి వివరాలు తెలుసుకునేందుకు మేజిస్ట్రేట్ జితిన్‌కుమార్ ఆటో వద్దకు వచ్చారు. కోర్టు ఆవరణలో ఆరుబయట ఆటోవద్ద కూర్చుని సాక్షి నుంచి మేజిస్ట్రేట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాక్ష్యం చెప్పేందుకు వచ్చిన వ్యక్తిని కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దేవేందర్ సైతం ఆటోలోనే పలు ప్రశ్నలు అడిగారు. నడవలేని పరిస్థితిలో ఉన్న సాక్షి వద్దకే న్యాయాధికారి కదిలి రావడంతోపాటు కోర్టు యంత్రాంగం అంతా వచ్చి వివరాలు సేకరించడం ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. నడవలేని స్థితిలో ఉన్న సాక్షి పట్ల మనవీయకోణంలో ఆలోచించి ఆదర్శప్రాయంగా వ్యవహరించిన ఖానాపూర్ మేజిస్ట్రేట్ జితిన్ కుమార్, పీపీ దేవేందర్ సహా మిగతా కోర్టు సిబ్బంది, న్యాయవాదులను స్థానికులు అభినందిస్తున్నారు.


సాక్షి కిషన్ వద్దకే వచ్చి వివరాలు సేకరిస్తున్న మేజిస్ట్రేట్ జితిన్ కుమార్

సోన్ సర్కిల్ సీఐగా గోవర్ధన్‌రెడ్డి

సోన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): సోన్ సర్కిల్ సీఐగా గోవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. నిర్మల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ నూతన సోన్ సర్కిల్ సీఐని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సోన్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేకర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భైంసా రూరల్ పీఎస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

భైంసారూరల్,మార్చి21 (ఆంధ్రజ్యోతి): భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ జానకి షర్మిల తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. సిబ్బంది జనరల్ కిట్‌లో ఉండే వస్తువుల వివరాలు, వాటి ఉపయోగాలు సిబ్బందికి వివరించారు. వాటిని భద్రపరిచే విధానాన్ని పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న ప్రభుత్వ వాహనాల రికార్డ్స్‌ను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాల రికార్డులను తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అలసత్వం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో కుభీర్, కుంటాల, తానూర్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ

ఆర్జీయూకేటీలో టెక్ ఫెస్టివల్

బాసర, మార్చి21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో ఆవిష్కరణ, ప్రతిభను పెంపొందించే లక్ష్యంతో బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో (అంతప్రజ్ఞ) టెక్ ఫెస్టివల్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ జ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థుల తమ సృజనాత్మకత, ఆవిష్కరణలను అన్వేషించడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ అంతప్రజ్ఞ టెక్ ఫెస్ట్2025 విద్యార్థుల ప్రతిభకు నిలయమని ప్రశంసించారు. విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులపై ఆయన తన విస్మయాన్ని వ్యక్తం చేస్తూ మా విద్యార్థుల కొత్త ఆవిష్కరణలు నిజంగా అద్భుతంగా ఉన్నాయి. వారి ఆలోచనలను తదుపరి స్థాయికి తీసుకెళ్లడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు మద్దతును మేము అందిస్తామని అన్నారు. అంతప్రజ్ఞ అత్యాధునిక సాంకేతికతలు, ఆవిష్కరణలను పెంపొందించడం, వ్యవస్థాపకతను ప్రోత్సహించడంలో విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవాన్ని అందించడానికి రూపొందించబడింది. ఈ చొరవ తదుపరితరం నాయకులు ఆవిష్కరణలను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నామని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఫ్యాషన్ షో, ఫ్లాష్ మాబ్, జానపద నృత్యం, సంగీతం జానపద పాటలు తదితర అంశాలతో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళి దర్శన్, ఏవో రణధీర్ సాగి, అసోసియేటెడ్ డాక్టర్ విఠల్, డాక్టర్ మహేష్, డాక్టర్ చంద్రశేఖర్, కన్వీనర్లు డాక్టర్ అజయ్, డాక్టర్ రాములు, స్వప్నిల్, ప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

• కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి


మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి

నిర్మల్‌అర్బన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జీల సహకారంతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మల్‌లో ఏర్పాటుచేసిన కలెక్టర్ కార్యాలయం ప్రజలకు దూరభారం అవుతుందని తమదృష్టికి వచ్చిందన్నారు. దీని కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడమా లేక నూతనకలెక్టరేట్ భవనము నిర్మల్ అనువైన ప్రదేశంలో కట్టడమా అనే విషయం సీఎంకు వివరిస్తామన్నారు. రాబోయే రోజుల్లో కచ్చితంగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు. కేంద్రప్రభుత్వం డిలిమిటేషన్ ప్రక్రియ చేపడితే ఆదిలాబాద్ జిల్లాలో రెండు నియోజకవర్గాలు పెరిగే అవకాశం ఉందని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నూతనంగా ఏర్పడే నియోజకవర్గాల్లో పోటీ చేస్తానన్నారు. లేకపోతే ఆదిలాబాద్ ఎంపీస్థానం జనరల్ రిజర్వేషన్ అయితే ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతానన్నారు.

ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

నిర్మల్‌కల్చరల్, మార్చి21(ఆంధ్రజ్యోతి): నిర్మల్ బార్ అసోసియేషన్ 2025-26 ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసినట్లు ఎన్నికల అధికారులు నూనె గంగాధర్, ఓస మహేందర్ తెలిపారు. అధ్యక్ష పదవికి అల్లూరి మల్లారెడ్డి, లోక లక్ష్మారెడ్డి, కల్వకుంట వినోద్‌రావు నామినేషన్లు దాఖలు చేయగా ప్రధాన కార్యదర్శి పదవికి వీవీ రమణారావు, షేర్ నరేందర్ దాఖలు చేశారు. మిగతా పోస్టులకు ఒక్కొక్కరు నామినేషన్‌వేశారు. 22న ఉపసంహరణ, 27న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

న్యాయవాదులకు ఇఫ్తార్ విందు

ఖానాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాది కామోజీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఇఫ్తార్‌విందును ఏర్పాటుచేశారు. ఈ ఇఫ్తార్ విందుకు ఖానాపూర్ జీఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ జితిన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రంజాన్ మాసం ప్రత్యేకతని న్యాయవాది షబ్బీర్ పాషా వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, ఏజీపీ ఆసిఫ్ అలీ, న్యాయవాదులు శేఖర్, వెంకట్ మహేంద్ర, కామోజీ వేణు, తదితరులున్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన

సారంగాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల అడెల్లి అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ కూలీలకు ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అడవుల సంరక్షణపై అటవీ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో అడవుల ప్రాముఖ్యత, వన్యప్రాణుల రక్షణతో పాటు అటవీ నిప్పు వల్ల కలిగే పరిణామాలపై ఉపాధి హామీ కూలీలతో వివరించి అటవీ ప్రాంతాలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిదని పేర్కొన్నారు. అనంతరం స్వర్ణలోగల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు అడవులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వప్న, వెన్నెల సుజాతలతోపాటు ఉపాధిహామీ కూలీలు, విద్యార్థులు ఉన్నారు.

నర్సరీల పరిశీలన

ముథోల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కారేగాం, ఎడ్‌బిడ్‌తోపాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను శుక్రవారం ఎంపీడీవో శివ కుమార్ పరిశీలించారు. పలు వివరాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. హరితహారం పథకానికి మొక్కలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు నీటిని పారించాలని సూచించారు. అలాగే డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. అనంతరం ఎడ్‌బిడ్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు శివ రెడ్డి, రాజు, తదితరులున్నారు.

'వ్యాధులపై అవగాహన అవసరం'

ఆదిలాబాద్ రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : స్వతంత్రం వచ్చిన తర్వాత వంద సంవత్సరాల్లో సికిల్‌సెల్‌ను అంతం చేయడానికి ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయ సమావేశ మందిరంలో సికిల్‌సెల్‌పై జిల్లా స్థాయి టీఓటీ శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సికిల్ సెల్ ఏ విధంగా వ్యాప్తి చెం దుతోంది. దాన్ని ఎలా కట్టడి చేయాలో ప్రొజెక్టర్ ద్వారా మెడికల్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్, ఏటీడీఓ అనిల్, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌కు బియ్యం అప్పగింత

ఉట్నూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ పోలీసుల ఆధ్వర్యంలో అక్రమ రవాణాకు డీలర్ కృష్ణయ్య సిద్ధం చేసిన 20 క్వింటాళ్ల బియ్యంను ఉట్నూర్‌లోని పౌరసరఫరాలమండల స్థాయి స్టాకిస్టు పాయింట్‌కు అప్పగించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ప్రేమ్‌నివాస్ తెలిపారు. డీలర్ కిష్టయ్య నడుపుతున్న షాప్ నెంబర్ మూడును గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలోని షాప్ నెంబర్ 2 ప్రఫుల్‌కు అప్పగించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా డీలర్ కృష్ణయ్య వద్ద ఉన్న ఈ పాస్ యంత్రాన్ని కూడా తాము స్వాధీనం చేసుకొని షాపు నంబర్ టూకు అప్పగించామన్నారు. షాప్ నంబర్ మూడు పరిధిలోని రేషన్‌కార్డుదారులు ఇక నుంచి షాప్ నెంబర్ రెండులో సరుకులు తీసుకోవాలన్నారు.

బాధితులకు పరామర్శ

ఉట్నూర్, మార్చి21 (ఆంధ్రజ్యోతి):ఆధార్‌కార్డులో వయస్సు పెంచి రాయడం వలన మృతిచెందిన రైతు రాజుపటేల్‌కు రైతుబీమా పథకం వర్తింపు కావడం లేదని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంగ్ భరత్‌చౌహాన్ అన్నారు. శుక్రవారం మండ లంలోని నర్సాపూర్ బి గ్రామాన్ని సందర్శించి మడావి రాజు పటేల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆధార్‌కార్డులో వయసు అధికంగా పడడంతో రైతుబీమా సొమ్ము ఐదు లక్షలు నష్టపోవాల్సి వస్తున్నందున జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని న్యాయం చేయాలన్నారు. పరామర్శించిన వారిలో ఆయన వెంట నర్సాపూర్ మాజీ ఎంపీటీసీ రాథోడ్‌పరశురాం, ప్రతమానంద్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'సకాలంలో లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలి'

ఆదిలాబాద్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెన్షనర్స్ కుటుంబాలు సకాలంలో లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు గడువు సమయం ఉందన్నారు.

ఉరివేసుకుని రైతు ఆత్మహత్య

తలమడుగు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలం సుంకిడి గ్రామానికి చెందిన కుమారి లింగన్న (48) అనే రైతు అప్పుల బాధతో శుక్రవారం తన పొలంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. సుంకిడి గ్రామానికి చెందిన కుమ్మరి లింగన్న అనే రైతు తనకున్న ఐదు ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే గత రెండేళ్లుగా పత్తి వేయగా.. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. దీంతో తెలిసిన వ్యక్తుల సుమారు రూ. 3లక్షల వరకు అప్పు చేశాడు. ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు.. మరోవైపు అప్పులు తీర్చాలని ఇచ్చిన వ్యక్తులు కోరడంతో లింగన్న తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. మరో గత్యంతరం లేని పరిస్థితుల్లో లింగన్న తన పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం సహాయ నిధి

ఇంద్రవెల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డీ.జహూర్ అన్నారు. శుక్రవారం చవాన్ అర్జున్‌కు 60 వేల రూపాయలు ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు.

లైసెన్స్‌ల ఎంపిక ప్రక్రియను త్వరగా చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): హమాలీల సమస్యలు, లైసెన్స్‌లపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిటీతో జిల్లా కలెక్టర్ రాజార్షిషా సమావేశం నిర్వహించి చర్చించారు. వ్యవసాయ కమిటీలలో హమీలీలకు కొత్తగా లైసెన్స్‌లు ఇచ్చేందుకు జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ కమిటీల అధికారులకు హమాలీ లైసెన్సులు జారీచేసేందుకు పేపర్ ప్రకటన ద్వారా దరఖాస్తులు స్వీకరించి ఎంపిక ప్రక్రియను మార్చి చివరిలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. కమిటీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా సహకార అధికారి, జిల్లా మేనేజర్ మార్క్‌ఫెడ్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, సీఈఓ గుడిహత్నూర్ పీఏసీఎస్ సబ్ కలెక్టర్, ఆర్డీఓలు సభ్యులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైని కలెక్టర్ అభిగ్యాన్,మార్కెట్ కమిటీ చైర్మన్, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, సహకార శాఖ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకరీచ్ లను గుర్తించి నివేదిక ఇవ్వాలి...

జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంను కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో శుక్రవారం జిల్లా కలెక్టర్, చైర్మన్ రాజార్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ట్రైని కలెక్టర్, ఏడీ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం


పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

సోనాల, మార్చి21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పదోతరగతి వార్షికపరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఉదయం 9.30 నుంచి 12.45 వరకు తెలుగు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి తీసుకెళ్లకుండా కేంద్రం నిర్వాహకులు క్షుణంగా తనిఖీలు నిర్వహించి సెంటర్‌లోకి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై బందోబస్తు నిర్వహించారు.

నేరడిగొండ : ఆయా కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలిరోజున నిర్వహించిన తెలుగు పరీక్షకు 330 మందికి గాను 328 మంది హాజరైనట్లు ఎంఈవో భూమారెడ్డి తెలిపారు. మొదటిరోజు పరీక్షలకు వెళుతున్న విదార్థులను పాఠశాల సిబ్బంది పరీక్ష కేంద్రాలకు తీసుకవెళ్లారు.

ఇంద్రవెల్లి: మండలంలోని మొత్తం మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 610 మంది విద్యార్థులు పరీక్షరాయాల్సి ఉండగా అందరూ పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ కూడా ఏర్పాటు చేసి పరీక్షలు సజావుగా జరగడానికి పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ఇచ్చోడ: ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. అరగంట ముందే విద్యార్థులను తనిఖీ చేసి, పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలల రెండు కేంద్రాలు, గురుకుల బాలికల, బాలుర పాఠశాలల్లో మొత్తం నాలుగు కేంద్రాల్లో ఇచ్చోడ, సిరికొండ మండలాల విద్యార్థులు పరీక్షలను రాశారు. ఒంటి పూట బడుల నేపథ్యంలో పరీక్ష కేంద్రాలున్నా పాఠశాలలకు మధ్యాహ్నం వచ్చే విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం సాయంత్రం అందుతోంది. పరీక్ష కేంద్రాలు ఉండడం వల్ల నాన్ టీచింగ్ స్టాఫ్‌ను మధ్యాహ్న భోజన కార్మికులకు పరీక్ష కేంద్రాలున్నా పాఠశాల లోనికి అనుమతి లేకపోవడం పరీక్ష ముగిసెంత వరకు ఆగాల్సిన పరిస్థితి ఎదురైంది. దీంతో మధ్యాహ్నం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేసరికి సాయంత్ర భోజనం అవుతోంది.

తలమడుగును కరువు ప్రాంతంగా ప్రకటించాలి : బీఆర్ఎస్

తలమడుగు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యా సకాలంలో వర్షాలు కురువక పంటలు పండలేదని, మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఝరి సహకార సంఘం చైర్మన్ వెల్మ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చర్లపల్లి, ఝరి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండల కన్వీనర్ తోట వెంకటేష్. నాయకులు. కేదారేశ్వర్ రెడ్డి, పిడుగు అభిరామ్ రెడ్డి, కాటిపేల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ జనక్, రమాకాంత్, నారాయణరెడ్డి పాల్గొన్నారు

'ఇఫ్తార్ విందు సోదర భావాన్ని పెంపొందిస్తాయి'

మావల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని పుత్లీబౌలిలో అమన్ ఫౌండెషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జూర పండ్లు తినిపించి రోజా ఉపవాసన్ని విడిపించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటిస్తూ ఉపవాసాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, నాయకులున్నారు..

'గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం'

తలమడుగు , మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటిసి గోకగణేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సాయి లింగీ గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన రూ8,60,0000 రూపాయల సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కల్యాణ లక్ష్మి రాజేశ్వర్, లాల్‌గడ లక్ష్మీపూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించి పనులు త్వరగా చేసుకోవాలని లబ్ధిదారులకు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, నాయకులు గంగారం మహాజన్, మోహన్, విట్టల్ ,రామన్న ,రావుల నారాయణ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎస్సైలు

బోథ్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల సముదాయంలో వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని తహసీల్దార్ మల్లేష్ శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం మండల కార్యాలయానికి వచ్చేవారికి తాగునీటి ఇబ్బందులు ఉండవద్దన్న దృక్పథంతో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు దీనిని వినియోగించుకోవాలని కోరారు.

బాసరలో వేద విద్యార్థికి తీవ్ర గాయాలు

● ఘటనపై పలు అనుమానాలు ● దర్యాప్తు చేస్తున్న పోలీసులు


ఘటనా స్థలం వద్ద బాలుడి కుటుంబసభ్యులు

బాసర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రంలోని వేద భారతి పీఠంలో వేద విద్యను అభ్యసిస్తున్న తుఫ్రాన్‌కు చెందిన 11సంవత్సరాల బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు వేద పాఠశాల నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో వేద పాఠశాలలో ఒక మూలన మరుగుదొడ్ల వద్ద బాలుడు తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. వెంటనే బాధిత బాలున్ని వేద పాఠశాల నిర్వాహకులు చికిత్స కోసం భైంసాకు తరలించారు. బాలుని తలపై తీవ్రమైన గాయాలుండడం, అనేక అనుమానాలకు తావిస్తోంది. గురువారం రాత్రి వేద పాఠశాలలో ఉన్న సీసీ కెమెరాలు కొన్ని గంటల పాటు పని చేయక పోవడం, బాలుడి తలపై తీవ్రమైన గాయాలుండడంతో ఎవరయిన దాడి చేసి ఉండవచ్చుననే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు బాసర పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఇది ముమ్మాటికి హత్యాయత్నం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బాసర ఎస్సై గణేష్ తెలిపారు. విచారణలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం బాలుడు భైంసాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

లక్కారంలో పసి పిల్లల పై కుక్కలదాడి

ఉట్నూర్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని లక్కారంలో శుక్రవారం పసి పిల్లల పై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. లక్కారంకు చెందిన మరికంటి మహేష్ కూతురు నైతన్య, మరికంటి కిరణ్‌కుమారుడు రుద్రాన్ష్‌లు ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేయడంతో ఇరువురు గాయపడ్డారు. గాయపడిన పిల్లలను హస్పిటల్‌కి తరలించి వైద్యం అందించారు.గ్రామ పంచాయతి అధికారులు తక్షణమే కుక్కలను నిరోదించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నేరడిగొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం హెచ్‌బీ పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలకు హెల్త్ సూపర్ వైజర్ సంతోష్ విద్యార్థినీలకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం రక్తనమూనాలను సేకరించారు. వేసవిలో విద్యార్థులు బయట తిరగవద్దన్నారు. వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో హెల్త్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నిషియన్ ఉత్తమ్, హెచ్‌ఎం అశోక్‌రావు ఉన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

నేరడిగొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బందం రేగడి బుర్కపల్లి, పాషాతండా, రాజురా గ్రామాలలో పర్యటించారు. నీటి సమస్యలపై ఆరా తీసి అక్కడున్న బోరు బావుల ద్వారా నీటిని అందేలా ఏర్పాటు చేశారు. నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎంపీడీవో వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప ఆలయానికి సీసీ రహదారి నిర్మాణ పనులు

ఇచ్చోడ, మార్చి, 21 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండల కేంద్రంలోని ఆయ్యప్ప ఆలయానికి వెళ్లే రహదారికి రూ. 14లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీ రహదారి నిర్మాణ పనులను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ అడె గజేందర్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ సీతక్క సహాయంతో బోథ్ నియోజకవర్గానికి రూ. 8 కోట్ల నిధులు తీసుకువచ్చామన్నారు.

బాసరలో ఘనంగా సమారాధన మహోత్సవాలు


కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

బాసర, మార్చి, 21 : (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతి అమ్మవారు కొలువై ఉన్న బాసర పుణ్యక్షేత్రంలో శ్రీ మహా రుద్ర సహిత అష్టోత్తర సమారాధన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి స్థానిక ఓ కళ్యాణ మండపంలో జరుగుతున్న ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు కొనసాగనుంది. మొదటి రోజు మహారుద్ర పారాయణం వంటి తదితర కార్యక్రమాలు కొనసాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండప పరిసరాలన్నీ వేద మంత్రోశ్చరణాలతో మారుమోగింది. ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయగా కూచిపుడి, భారత నాట్యం వంటి నృత్యాలు అందరిని అలరింపజేశాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో బ్రహ్మణోత్తములు హాజరై పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వైద్య పరీక్షలు

ముథోల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రమైన ముథోల్‌లో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు భైంసా ఏరియా ఆసుపత్రి నేతృత్వంలో షూర్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పని చేసే చోటుకు వెళ్లి సిబ్బంది రక్త నమూనాలను సేకరించారు. అలాగే ఈ సందర్భంగా ఏపీవో శిరీషా రెడ్డి మాటాడుతూ.. కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పని చేసే చోట్ల ప్రతి ఒక్కరూ నీళ్ల ఎక్కువగా తాగాలని, ఎండకు తిరగకూడదని పలు జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ విలాస్, ఏఎన్‌ఎం సంగీత, స్వరూప, సౌమ్య, శిల్ప, కూలీలు, తదితరులున్నారు.

24న జై సంవిధాన్ కార్యక్రమము

నిర్మల్ అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 24న మంజులాపూర్‌లోని మారుతి ఇన్‌లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఏఐసీసీ, పీసీసీ ఆదేశానుసారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే కార్యక్రమానికి పీసీసీ పరిశీలకుడు యూసుఫ్ జాహీ, సిహెచ్. రాంభూపాల్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, ఆలయ కమిటీ చైర్మన్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొనాలని కోరారు.

అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పెంబి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అడవులు పచ్చగా ఉంటేనే మన అందరి జీవితాలు ఆనందమయంగా ఉంటాయని, ప్రతి ఒక్క వ్యక్తి కూడా అడవుల సంరక్షణను తమ బాధ్యతగా భావించాలని ఇటిక్యాల్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రతాప్ అన్నారు. శుక్రవారం మండలంలోని లోతర్య తండా గ్రామంలో ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, సిర్పూర్ పేపర్ మిల్లు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆగ్రో ఫారెస్ట్రీ మొక్కల పెంపకంపై రైతులకు, గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏఈవో రాజ్ కుమార్ మాట్లాడుతూ... అటవీ శాఖ, సిర్పూర్ పేపర్ మిల్లు వారి ప్రోత్సాహంతో మండల పరిధిలో ఇప్పటికే 250 ఎకరాల మేర రైతులు వర్షాధారంగా నీలగిరి సాగును చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిర్పూర్ పేపర్ మిల్లు ప్లాంటేషన్ అధికారి శ్రీధర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సుందర్, సుధాకర్, బీట్ ఆఫీసర్లు స్రవంతి, కిరణ్, గంగారాం పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో సామాజిక తనిఖీ ప్రజావేదిక


లక్ష్మణచాందలో మాట్లాడుతున్న అధికారిణి

లక్ష్మణచాంద, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ మాట్లాడుతూ... మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 385 పనులకు గాను లేబర్ కాంపోనెంట్ క్రింద రూ. 6,01,00,836 నిధులను, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 15,80,881 నిధులను మొత్తం కలిపి రూ. 6,16,81,717లను ఖర్చు చేసినట్లు తెలిపారు. అలాగే రూ. 3,01,26,344 పీఆర్ నిధులను ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ మొత్తం పనులకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ పూర్తి చేశామన్నారు. ఆ తరువాత గ్రామ పంచాయతీల వారీగా డీఆర్పీలు సామాజిక తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. నిధుల దుర్వినియోగం ఎక్కడా పెద్దగా కనిపించనప్పటికీ వ్యవహారిక తప్పిదాల వలన కొందరు కూలీలకు చెల్లించాల్సిన మొత్తం కంటే తక్కువ చెల్లించటం, మరికొందరికి చెల్లించాల్సిన దానికంటే ఎక్కువ చెల్లించటం జరిగాయన్నారు. ఏ ఒక్క గ్రామ పంచాయతీలో రోజ్ గర్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనట్లు డీఆర్పీలు వెల్లడించారు. కాగా ఈ ప్రజా వేదికలో అధికారులు ఎక్కువ ప్రజలు తక్కువ ఉండడం గమనార్హం.

పారదర్శకంగా పనులు జరిగాయి...

ప్రజావేదిక ముగింపు సందర్భంగా డీఆర్డీవో విజయలక్ష్మి మాట్లాడుతూ... మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జిల్లా వ్యాప్తంగా పారదర్శకంగా జరిగాయన్నారు. అలాగే జిల్లా మొత్తం సామాజిక తనిఖీ పూర్తయిందని తెలిపారు. చిన్న చిన్న పొరపాట్లు మినహా ఎక్కడ కూడా పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు తనిఖీలో వెల్లడి కాలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, అంబుడ్స్‌మెన్ నవీన్, తహసీల్దార్ జానకి, ఎంపీడీవోలు రాధా రాథోడ్, మోహన్, శేఖర్, రాంప్రసాద్, ఏపీవో ప్రమీల, ఎంపీవో అమీర్ ఖాన్‌ఉన్నారు. సామాజిక తనిఖీ ప్రజా వేదిక ముగుస్తున్న సమయంలోనే మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన పలువురు ఉపాధి హామీ కూలీలు వచ్చి తమకు సక్రమంగా కూలీ డబ్బులు రావటం లేదని డీఆర్డీవో విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆమె త్వరలో మీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

రూ. 100 ఎందుకు వసూలు చేస్తున్నారని అడిగినందుకు పనికి రానివ్వటం లేదు...

● పుట్టి సాగర్, ఉపాధి హామీ కూలీ, వడ్యాల్

ఉపాధి హామీ పనికి వెళ్తున్న కూలీల వద్ద వడ్యాల్ ఫీల్డ్ అసిస్టెంట్ రాములు ఒక్కొక్కరికి రూ. 100 వసూలు చేస్తున్నారు. 100 రూపాయలు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించినందుకు నన్ను పనికిలోకి రానివ్వటం లేదు. మహిళల చేత నాకు గొడవ పెట్టిస్తున్నాడు. లేదంటే పని బంద్ చేసి నా వలన పని బంద్ అయ్యిందని కూలీలకు చెప్పి తద్వార నన్ను పని గ్రూపులో చేర్చుకోకుండా పనికి రాకుండా చేస్తున్నాడు.రూ. 100 ఇవ్వనందుకు మాస్టర్‌లో హాజరు వేయకుండా, కూలీ డబ్బులు రాకుండా చేశాడు.

అర్హులైన దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నిర్మల్ అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూడీఐడీ కార్డుల జారీపై మార్గదర్శకాలు, దివ్యాంగుల సమస్యలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, దివ్యాంగులతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సదరం సర్టిఫికెట్‌కు బదులుగా అర్హులైన ప్రతి దివ్యాంగుడికి యూనిక్ డిసెబిలిటీ ఐడీ (యూడీఐడీ) నంబర్‌ను కేటాయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మార్చి 1, 2025 నుంచి దివ్యాంగుల పునరావాసం, సాధికారత కోసం డైనమిక్ వెబ్ ఎనేబుల్ సిస్టమ్‌ను రూపొందించిందని తెలిపారు. మీ సేవ కేంద్రాల ద్వారా నూతనంగా యూడీఐడీ కార్డులను జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఉన్నవారు, నూతనంగా యూడీఐడీ కార్డుల కోసం మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఆసుపత్రిలో స్లాట్ బుకింగ్ చేసి, నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తర్వాత యూడీఐడీ కార్డులు జారీ చేస్తారని తెలిపారు. ఈ కార్డులు 21 రకాల వైకల్యం కలిగిన దివ్యాంగులకు అందించడం జరుగుతుందని, స్పీడ్ పోస్ట్ ద్వారా నేరుగా దివ్యాంగుల ఇంటి చిరునామాకు అందుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల లబ్ధి, పునరావాసం, సాధికారతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తామని అన్నారు. అనంతరం యూడీఐడీ కార్డుల జారీ మార్గదర్శకాలపై సంబంధిత విభాగాల వైద్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, దివ్యాంగులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన కల్పించాలి

ఖానాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం ఒకే ఎన్నికపై క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని బీజేపీ కార్యకర్తలకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశాన్ని 70 ఏళ్ల పాటు ఏలిన కాంగ్రెస్ దేశ వ్యతిరేక చట్టాలను రూపొందించిందన్నారు. మన సాంస్కృతి, సాంప్రదాయాలకు నష్టం వాటిల్లేలా జరుగుతున్న చర్యలను ఇప్పటికైనా ప్రజలు గుర్తించడం అభినందనీయమన్నారు. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు బీజేపీకి పట్టం కట్టడం వెనుక పార్టీ కార్యకర్తల కృషి ఎనలేనిదని కొనియాడారు. దేశ వ్యాప్తంగా ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం ద్వారా దేశంలో 4.50 లక్షల కోట్ల రూపాయలు ఆదా చేయవచ్చన్నారు. ఒకే దఫాలో ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలు నిర్వహించి ఆ తర్వాత మూడు నెలల్లోనే సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ మున్సిపల్ సహా మిగతా ఎన్నికలు అన్నింటిని నిర్వహించడం ద్వారా దేశంలో నాలుగు సంవత్సరాల 8 నెలల పాటు పాలకులు పాలనపై దృష్టి పెట్టవచ్చన్నారు.

నిర్మల్ జిల్లాలో పది పరీక్షలు ప్రారంభం


లక్ష్మణచాందలో హాజరైన విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పది పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈవో రామారావు తెలిపారు. మొత్తం 9,122 విద్యార్థులను గాను 9,115 మంది విద్యార్థులు హాజరయ్యారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్టు తెలిపారు.

లక్ష్మణచాంద, : మండలంలోని శుక్రవారం జరిగిన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. వడ్యాల్ పరీక్షా కేంద్రంలో 168 మంది విద్యార్థులకు 168 మంది, లక్ష్మణచాంద పరీక్షా కేంద్రంలో 174 మంది విద్యార్థులకు 174 మంది హాజరయ్యారు. దీంతో 100 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

దస్తురాబాద్ : పదవ తరగతి పరీక్షలో మొత్తం 139 మంది విద్యార్థులకు గాను 139 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరిండెంట్ వెంకట రమణ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై సి.అశోక్ సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు. కాగా పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించారు.

నర్సాపూర్(జి) : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్, పటిష్ట బందోబస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రాన్ని నిర్మల్ రూరల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. నర్సాపూర్(జీ) ఎస్సై సాయి కిరణ్, సిబ్బంది రవీందర్ రెడ్డి, మమత ఉన్నారు.

సోన్ : పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 162 మంది విద్యార్థులకు గాను 162 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షా కేంద్ర నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా లెఫ్ట్ పోచంపాడ్ పరీక్షా కేంద్రంలో 135 మంది విద్యార్థులకు గాను 135 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షా కేంద్ర నిర్వాహకులు తెలిపారు. ఎస్సై ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

కడెం : మండల కేంద్రమైన కడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో శుక్రవారం పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రంలో 248 మంది విద్యార్థులకు గాను 248 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు పరీక్షను రాశారు. పరీక్షా కేంద్రం సీఎస్ వి. రమేష్, డీవో రవీందర్ పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా కొనసాగాయి. పరీక్షా కేంద్రాన్ని కడెం మండల తహసీల్దార్ రొడ్డ ప్రభాకర్, ఎంఈవో షేక్ హుస్సేన్, సిట్టింగ్ స్క్వాడ్ గంగన్నలు సందర్శించి తనిఖీలు చేశారు. బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఖానాపూర్ : శుక్రవారం ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. ఖానాపూర్ పట్టణంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లను నిర్వహించారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లోని మూడు పరీక్షా కేంద్రాలు మండలంలోని అష్ట ఉన్నత పాఠశాలలో మొదటి రోజు శుక్రవారం ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ముథోల్‌లోని మూడు పరీక్షా కేంద్రాలను ముథోల్ తహసీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు.

లోకేశ్వరం : జిల్లా పరిషత్ సెకం డరీ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్లలో మొత్తం విద్యార్థులు 270 పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాలను మండల స్థాయి అధికారులు తహసీల్దార్ మోతిరాం, ఎంపీవో సల్మాన్ రాజ్, స్థానిక ఎస్సై అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్విజిలేటర్లతో మాట్లాడారు. విద్యార్థులు ఎలాంటి మాస్ కాపీయింగ్‌లో పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సేంద్రియ ఎరువుపై అవగాహన లోపం

● పొరుగు జిల్లాలకు తరలింపు



సేంద్రియ ఎరువును లారీల్లో నింపుతున్న కూలీలు

బోథ్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ప్రాంతాల నుండి ప్రతి యేటా వందలాది లారీల సేంద్రియ ఎరువు పశువుల పేడ లారీలలో తరలి పోతుంది. ఫలితంగా అన్నదాతలకు సేంద్రియ ఎరువు లేకపోవడంతో రసాయనిక ఎరువులను వాడుతున్నారు. ఫలితంగా పంట దిగుబడి వచ్చిన పెట్టుబడి ఖర్చు మాత్రం పెరిగిపోతున్నది.

● రైతులకు అవగాహన లేక

సేంద్రియ ఎరువులో ఉన్న సామర్థ్యంపైన రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో గ్రామీణ ప్రాంత రైతులు ప్రతి ఏడాది సేంద్రియ ఎరువులను విక్రయిస్తున్నారు. వర్షాకాలంలో రసాయన ఎరువులను కొనుగోలు చేసి పంటల సాగుకు వినియోగిస్తున్నారు. ఫలితంగా రైతులకు పంట పెట్టుబడు ను విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో రైతులు నష్టపోవాల్సివస్తుంది.

● లారీ ఎరువు రూ.15 వేలు

గ్రామీణ ప్రాంతాల్లో సేంద్రియ ఎరువు లారీకి 15 వేల రూపాయలు వెచ్చిం చి దళారీలు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన ఎరువును నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాలకు తీసుకువెళ్లి రూ.20 వేలకు విక్రయిస్తున్నారు. దీంతో స్థానిక రైతులు ఎరువులను విక్రయించుకుంటున్నారు. మరోవైపు ప్రస్తుత సమయం లో రైతుల వద్ద డబ్బులు లేకపోవడంతో కొంతమంది పేద రైతులు సేంద్రియ ఎరువులను విక్రయించుకుంటున్నారని పేర్కొంటున్నారు. అయితే సేంద్రియ ఎరువులతో ఉన్న లాభాలను వ్యవసాయ అధికారులు వివరించాల్సిన అవసరం ఉంది. ఒక సారి సేంద్రియ ఎరువు చల్లితే ఐదు సంవత్సరాల వరకు పంటకు ఎంతగానో ఉపకరిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అం టున్నారు. సేంద్రియ ఎరువు వాడితే రసాయనిక ఎరువులు వాడే అవకాశం రాదని వారు అంటున్నారు. ఏది ఏమైనా రైతుల పేదరికం అవగాహన లోపం వల్ల సేంద్రి య ఎరువు రైతు వాడడం లేదు.

రైతు గుండెకు టమాట ధరల పోటు

● మార్కెట్‌లో రూ.3కు పడిపోయిన కిలో ధర
● దక్కని లాభం.. ఆశలు ఆవిరి
● విస్తీర్ణం పెరిగినా.. ప్రయోజనం శూన్యమే!
● కొనుగోళ్లు లేక పారవేస్తున్న నిర్మల్ జిల్లా అన్నదాతలు

భైంసా, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పుడమి తల్లిని నమ్ముకున్న రైతన్నకు గత కొంత కాలంగా ఏ కాలమూ కలిసి రావడం లేదు. మూడున్నర ఏళ్లుగా ప్రతికూల పరిస్థితులతో పంటలు పండక రైతులు కుదేలయ్యారు. సంప్రదాయ పంటలు వేస్తే ప్రయోజనం ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు పదే పదే హెచ్చరించడంతో రైతన్నలు ఈసారి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపారు. నాలుగు రూపాయలు కళ్ల చూద్దామనుకుని టమాట, ఇతర కూరగాయల సాగు వైపు దృష్టి కేంద్రీకరించారు. ప్రత్యేకించి టమాటా తక్కువ కాలంలో పండి అధిక దిగుబడులు ఇస్తుంది. తద్వారా లాభాలను పొందవచ్చునని రైతులు భావించారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలో ఎక్కువ మంది రైతులు టమాట పంటనే అధికంగా సాగు చేశారు. కానీ మూడున్నర ఏళ్లుగా ప్రకృతి పరిహాసం చేయడంతో కష్టనష్టాల పాలైన అన్నదాతలకు ఈసారి ధరల రూపంలో ఎదురు దెబ్బ తగిలింది. మార్కెట్‌లో పడిపోయిన ధరలతో పంటను ఏం చేయాలో అర్థంకాక జిల్లాలోని టమాట రైతులు కుంగిపోతున్నారు.

● జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం

వాణిజ్య పంటలపై దృష్టి పెట్టాలని వ్యవసాయ అధికారులు, నిపుణులు జిల్లా రైతులకు పదేపదే చెప్పడంతో.. జిల్లాలోని చాలా మంది రైతులు ఇతర పంటల గురించి ఆలోచించారు. అంతో ఇంతో అనుభవం ఉన్న రైతులు కూడా కూరగాయల పంటలపై అధికంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా నీరు ఒక మోస్తరుగా సరిపోయే టమాట సాగు వల్ల లాభం గడించవచ్చని ఆలోచించిన రైతులు.. ఈ పంట సాగుకు కదిలారు. తద్వారా టమాటా సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. గతంలో కూరగాయల సాగులో టమాట 15 శాతంగా ఉండగా.. నేడు అది కాస్త 35శాతానికి పెరిగింది. ప్రతీ సంవత్సరం జిల్లాలో రైతులు 400 నుంచి 500 హెక్టార్ల వరకు టమాట పంటను సాగు చేస్తారు. కానీ ఈ సంవత్సరం రెట్టింపు స్థాయిలో 1000హెక్టార్లకు పైగానే సాగు చేశారు. గత సంవత్సరం ధరలు ఆశాజనకంగా ఉండడంతో పాటు వ్యవసాయాధికారులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పదే పదే సూచించడంతో జిల్లాలో టమాట సాగు విస్తీర్ణం పెరిగింది.

● పడిపోయిన ధర

జిల్లాలో టమాట సాగు పెరగడంతో పాటు దిగుబడి కూడా అధికంగా ఉండడంతో.. ధర ఒక్కసారిగా పడిపోయింది. గత నెల వరకు ధర ఆశాజనకంగా ఉండగా.. ఈ నెల అరంభం నుంచి ధరలు క్రమక్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. రెండు రోజులుగా భైంసా మార్కెట్ పరిధిలో టమాట ధరలు పూర్తిస్థాయిలో తగ్గిపోయాయి. ప్రస్తుతం హోల్ సెల్ మార్కెట్లో కిలో టమాట ధర రూ.3కు పడిపోయింది. ఈ క్రమంలో 25కిలోల బాక్స్ ఒక్కటి రూ.75కి అమ్ముడు



భైంసా మార్కెట్లో విక్రయానికి తీసుకువచ్చిన టమాట దిగుబడులు



రైతులు పారవేసిన టమాట దిగుబడులు



కొనుగోళ్లు జరగకపోవడంతో ఆటోలో టమాట దిగుబడులను ఇంటికి తీసుకువెళుతున్న రైతులు

పోతున్నాయి. గుబడులు అధిక మొత్తంలో మార్కెట్‌కు విక్రయానికి వస్తున్న నేపథ్యంలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం లభిస్తున్న ధరలు పంటచేలలో టమాటలను తెంపేందుకు కూలీ చార్జీలు, దిగుబడులను మార్కెట్‌కు విక్రయించేందుకు తీసుకొచ్చే రవాణా చార్జీలు , తైబజారు చెల్లింపులకు కూడా సరిపోవడం లేదని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. టమాటలు తెంపడానికి ఒక్కో కూలికి రోజు రూ.300 నుంచి రూ.350 చార్జీ చెల్లిస్తుండగా.. ఒక్కో కూలి రోజుకు 25 కిలోల సామర్థ్యం గల 15 బాక్స్‌లను నింపుతున్నాడు. ఒక్కో బాక్స్‌ను మార్కెట్‌కు తీసుకవచ్చేందుకు రవాణ చార్జీ కింద రూ15 నుంచి రూ.20 చెల్లించాల్సి వస్తోంది. ఇక తైబజార్ కింద ఒక్కో బాక్స్‌కు రూ.5 అప్పచెబుతున్నారు. ఇలా ఒక 25 కిలోల ఒక బాక్స్‌ను పంట చేల నుంచి తెంపి ఆటోలో మార్కెట్‌కు తీసుకవచ్చి తైబజార్ రుసుం చెల్లించి విక్రయాలు చేపట్టేందుకు రూ.50 నుంచి రూ.60 వరకు వ్యయమవుతోంది. దీంతో ఒక బాక్స్ వెనుక అన్నదాతలకు కేవలం రూ.10 నుంచి రూ15 వరకు మాత్రమే మిగులుతోంది. సాగు వ్యయ భారం పెరుగుతూ పోతుండగా మార్కెట్‌లో ధరలు అంతంత మాత్రంగానే లభ్యమవుతుండటంతో రైతులు ఆందోళన చెందాల్సి వస్తోంది. ఏ పంట సాగు చేయాలన్నా.. ఎకరానికి ఎంత కాదన్నా రూ. 15 నుంచి రూ. 20 వేలు ఖర్చు అవుతోంది. దీనినైనా దృష్టిలో పెట్టుకొని అధికారులు కనీస ధర నిర్ణయించకపోవడంతో రైతులు నష్టపోయి దళారులకు లాభం చేకూరేలా మారిపోయింది. టమాట పంట సాగు చేయాడానికి కేజీకి రూ. 5 వరకు ఖర్చు అవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. చక్కటి టమాటను రైతులు విక్రయించాలని చూస్తే దళారులు ఇచ్చే మాత్రం రూ. 3. సాగు చేసిన రైతుకు కనీసం విత్తనాలకు పెట్టే ఖర్చు కూడా దక్కదని పరిస్థితి నెలకొంది. అంటే పంట సాగు చేసే రైతుకు కనీసం రూ. 15 నుంచి రూ. 20 వరకు అమ్మితే తప్ప గిట్టుబాటు కాని పరిస్థితి ఉంది. అలాంటి పంట నేడు 3 .రూపాయలకు అమ్మితే రైతు ఎంత నష్టపోతాడన్న విషయం ఎవరికైనా సులభంగా అర్థమైపోతుంది.

నష్టాలు తప్పేలా లేవు..

సుధాకర్, కూరగాయల రైతు, మిర్జాపూర్, భైంసా మండలం



గత సంవత్సరం ఆశించిన ధరలు లభించడంతో పాటు ఈయేడు అధికార యంత్రాంగం సూచనల మేరకు ప్రత్యామ్నాయ సాగులో భాగంగా టమాట పంటను వేశా. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధరలు మాత్రం పూర్తి స్థాయిలో నిరాశాజనకంగా ఉంది. ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితుల దృష్ట్యా నష్టాలు తప్పేలా లేవు. వ్యయభారం ఇంతకింతకీ పెరగ్గా.. ధరలు మాత్రం తగ్గుతూ పోతున్నాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

దయనీయ స్థితికి చేరుకున్నాం

కె.లక్ష్మణ్, కూరగాయల రైతు, మాంజ్రీ, భైంసా మండలం



సాగుబడిలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులతో రైతులు దయనీయ స్థితికి చేరుకున్నారు. పెట్టుబడి మాట చేతికి వచ్చుడు.. దేవుడెరుగు యేటా నష్టాలతో కష్టాల పాలవుతున్నాం. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసిన ప్రయోజనం లేకుం డా పోయింది. ధరల తగ్గుదలతో టమాట రైతులు ఆందోళన చెందుతున్నారు.

● శీతల గిడ్డంగులు కరువే!

కూరగాయలు ఎక్కువగా సాగు చేసే జిల్లాలో శీతల గిడ్డంగులను ఏర్పాటు చేస్తే రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లాలో టమాట, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, చిక్కుడు, బెండ, వంకాయలు, ఆకుకూరలు మెంతికూర, కొత్తిమీర పాలకూర, తోటకూర తదితరులను ఎక్కువగా సాగు చేస్తారు. ఆకుకూరలు అతి సూక్ష్మ పంటలు కావడంతో ధర ఉన్నప్పుడు చేతికి వస్తేనే ఆదాయం. లేదంటే పొలంలో లేదా చెత్తకుప్పలలో పడేయాల్సిందే. ఇక కూరగాయలు కూడా సూక్ష్మరకం పంటలు అయినా వాటిని శీతల గిడ్డంగిలో ఉంచితే ధర ఉన్న సమయంలో అమ్ముకునేందుకు వీలుపడుతుంది. టమాట, వంకాయ, చిక్కుడు, బెండ దిగుబడులకు సంవత్సరంలో మూడు నుంచి నాలుగు నెలలో తప్పకుండా అధికంగా ధర అందుతుంది. ఆ సమయంలో రైతులు అమ్ముకునేందుకు శీతల గిడ్డంగులు ఉపయోగపడతాయి. కానీ వాటి ఏర్పాటు గురించి అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇలాంటి ధరలు తగ్గిన సమయంలో పంటను శీతల గిడ్డంగులలో ఉంచితే ధర పలికినప్పుడు మంచి ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు.

● పారవేస్తున్న రైతులు

అధిక మొత్తంలో టమాట దిగుబడులు మార్కెట్‌కు తరలివస్తున్నాయి. ఇక్కడి కూరగాయల హోల్‌సెల్ మార్కెట్ మొత్తం టమాట దిగుబడులతో నిండిపోతోంది. ఈ క్రమంలో వ్యాపారులు కొనుగోలు చేయగా.. మిగిలిపోయిన టమాట దిగుబడులను రైతులు ఇంటికి తీసుకెళ్లేందుకు రవాణా చార్జీలు చెల్లించలేక ఇక్కడి ప్రాంతంలోనే వదలి పెడుతున్నారు. కొంత మంది రైతులు పారవేస్తున్నారు. ఇంకొంత మంది రైతులు చేలలో తెంపకుండా తమ పశువులను అందులో మేపడానికి వదిలి పెడుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతుంది.



శిథిలావస్థకు చేరిన పల్లె దవాఖాన భవనం

నాసిరకం.. నాణ్యతా లోపం!



పల్లె దవాఖానలు నాణ్యతా లోపానికి చిరునామాగా మారాయి. బయటి నుంచి చూస్తే అందమైన భవనంలా కనిపిస్తున్నా.. లోపల అంతా డొల్లేనని తేలిపోతుంది. గత ప్రభుత్వం మూడేళ్ల క్రితం ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చి కొత్తగా భవనాలు నిర్మించింది. కానీ ప్రారంభించిన కొన్నాళ్లకే గోడకు పగుళ్ల తేలడం.. కీటికీలు.. తలుపులు విరిగిపోవడంతో నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఆదిలాబాద్ గ్రామీణ వండలం ఖండాల పంచాయతీలో నిర్మించిన పల్లె దవాఖాన దుస్థితిని తెలిపే చిత్రాలివి. ● (స్టాఫ్, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)

రంజాన్ మాసంలో ఫలాలకు ప్రాధాన్యం

భైంసా, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలు చేస్తారు. దీక్షలు విరమించే సమయంలో ఖచ్చితంగా ఫలాలను తీసుకుంటారు. ఈ సమయంలో ఫలాలను తీసుకుంటే శరీరానికి శక్తి రావడంతో పాటు విటమిన్లు అందుతాయి. అందుకే ఫలాలను అల్పాహారంగా తీసుకుంటారు. రంజాన్ మాసంలో సాయంత్రం వేళ జరిగే ఇఫ్తార్ విందులో ఫలాలకు ప్రాధాన్యం ఇస్తారు.

● ఉపవాస దీక్షలో నిగూఢమైన పరమార్థం

పవిత్ర రంజాన్‌లో ముస్లింలు పగటిపూట ఉండే కఠినమైన ఉపవాస దీక్షకు ఎంతో పరమార్థం ఉందని మతపెద్దలు పేర్కొం టున్నారు. పవిత్రమైన ఉపవాస దీక్షను ముస్లి రోజాగా పిలుస్తారు. నెల రోజుల పాటు ఈ ఉపవాసాన్ని ఒక పవిత్రమైన దీక్షగా ముస్లింలు పాటిస్తారు. ఈ ఉపవాస దీక్షకు ఖురాన్‌లో ఎంతో పవిత్రత, ప్రాముఖ్యత ఉంది. రంజాన్ ఉపవాసదీక్షకు సంబంధించి అంతర్గత అంశాలను పరిశీలిస్తే అనేక వాస్తవ పరిస్థితులను అవగతమవుతాయి.

● మనిషిని మానవోత్తముడిగా

మనిషిని మానవోత్తముడిగా తీర్చిదిద్దడంతో పాటు హృదయాన్ని పవిత్రతతో నియడం ఉపవాసదీక్ష ముఖ్యమనిషిని భయ, భక్తులు కలవాడిగా మలుస్తుంది. పాపిభీతి చెబుతుంది. దీని ద్వారా మనుషుల పాపకార్యాల వైపు మరలకుండా చూస్తుంది. మనుషుల్లోని చెడు ను పారద్రోలుతూ మంచి హృదయంతో సత్కార్యాలు చేసేలా చేస్తుం ది. ఇలాంటి స్థితిని మానవుడిలో కలిగించడమే ఈ రంజాన్ కఠిన ఉపవాస దీక్ష ప్రధాన ఉద్దేశ్యంగా పవిత్ర ఖురాన్‌లో చెప్పబడింది.



● ధనవంతులకు ఆకలి బాధ తెలిసేందుకు

ధనవంతులకు ఆకలి బాధ తెలిసేందుకు ఉపవాస దీక్ష ఉపయోగ పడుతుంది. దీంతో ధనవంతులు పేదలకు సాయం చేయడానికి స్వ చ్ఛందంగా ముందుకు వస్తారని ఖురాన్‌లో పేర్కొన్నట్లు మత పెద్దలు వివరిస్తున్నారు.

● యాపిల్



ఈ ఫలంలో సీ విటమిన్ అధికంగా ఉంటుంది. చిగుళ్లు, నోరు పగలకుండా రోగనిరోధక శక్తిని ఇస్తుంది.

● పైనాపిల్



ఈ పండు ఆరోగ్యానికి శ్రేయస్కరం. ఆకలి పెంచుతుంది. ఏసీడీటీ కంట్రోల్ చేస్తుంది. వ్యాధి నిరోధక శక్తిగా పని చేస్తుంది.

● అరటిపండు



కాల్షియంతో పాటు పోటా షియం ఎక్కువగా ఉంటుంది. ఇవి తినడం ద్వారా షుగర్ లెవల్స్‌ని తగ్గనివ్వదు. శక్తిని ఇస్తుంది. ఉపవాస దీక్షల అనంతరం ఈ పండ్లను తీసుకుంటే బలంగా ఉండవచ్చు.

● పుచ్చకాయ




పుచ్చకాయ తినడం వల్ల శరీరానికి చల్ల దనాన్ని ఇస్తుంది. ఉపవాస దీకలు చేసే వారు తప్పకుండా ఈ ఫలాన్ని తీసుకుంటే నీరసం నుంచి బయట పడొచ్చు. ఇది ఏసీడీటీని కూడా కంట్రోల్ చేస్తుంది.

● దానిమ్మ



జీర్ణ వ్యవస్థను మెరుగు పరుస్తుంది. ఇందులో సీ విటమిన్ లభిస్తుంది. దానిమ్మ విత్తనాల్లో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో జీర్ణ వ్యవస్థ మెరుగు పర్చడమే కాకుండా ఆకలిని పెంచుతుంది.

● ఖర్జూరం



ముస్లింలు ఉపవాస దీక్షను ఖర్జూరంతో విరమిస్తారు. ఈ పండులో మినరల్స్, విటమిన్స్ కాల్షియం ఎక్కువగా ఉంటాయి. దీక్షలు విరమించిన అనంతరం వీటిని తీసుకుంటే శరీరంలో శక్తి పెంపొందుతుంది.



రోటో వేటర్



డ్రోన్



పవర్ వీడర్

యాంత్రీకరణ.. పునరుద్ధరణ

● ఈ నెల 25 నుంచి దరఖాస్తుల స్వీకరణ ● మహిళా రైతులు మాత్రమే అర్హులు ● నిర్మల్ జిల్లాకు 397 యూనిట్లకు రూ.80.92 లక్షల మంజూరు



పవర్ టిల్లర్

భైంసా, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించింది. అన్నదాతలకు ప్రయోజనం చేకూరేలా పునః ప్రారంభించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్మల్ జిల్లాకు మొతం 397 యూనిట్ల కోసం గాను రూ. 80.92లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. సంబంధిత మంజూరి నిధులలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరిస్తాయి. అయితే ఈ పథకానికి కేవలం మహిళా రైతులు మాత్రమే అర్హులు. సన్న, చిన్నకారు, ఇతర వర్గాలకు చెందిన మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 50 శాతం రాయితీపై అవసరమైన పరికరాలను సరఫరా చేస్తారు.

● నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు

కొన్ని దశాబ్దాల నుంచి వ్యవసాయ శాఖలో యాంత్రీకరణ పథకం అమలవుతోంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో అప్పటి కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసింది. యాంత్రీకరణ పరికరాలు కొనలేక రైతులు ఇబ్బందులు పడ్డారు. కొన్నేళ్లుగా రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు ఈ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు సంబంధించి నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులను మూడు రోజుల క్రితం వెలువరించింది.

● 25 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఈ నెల 25 నుంచి వ్యవసాయ శాఖ అధికారులు మహిళా రైతుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆ తర్వాత వివిధ కంపెనీలకు చెందిన తయారీదారులు సంబంధిత పరికరాలను సరఫరా చేయాల్సి ఉంటుంది. సబ్ మిషన్ ఆఫ్ ఫామ్ మెకనైజేషన్ పథకం కింద ఎంపికైన వారికి యాంత్రీకరణ పరికరాలు అందజేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ఈ నెలాఖరులోగా పూర్తవుతుంది.

● రైతులకు ప్రయోజనం

(అంజీ ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్)

వ్యవసాయ యాంత్రీకరణ పథకం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతులు వీటి వల్ల లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. అన్నదాతలు తమకు అవసరమైన పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో కొనసాగుతుంది.

పరికరాలు	కేటాయించిన యూనిట్లు	నిధులు (రూ. లక్షల్లో)
1 రోటావేటర్లు	70	రూ. 33.60లక్షలు
2. బ్యాటరీ/పూట్, మాన్యువల్ ఆపరేటెడ్ పీపీఈ పరికరాలు	104	రూ. 1.04లక్షలు
3. పవర్ ఆపరేటెడ్ స్ప్రెయర్	105	రూ. 9.45లక్షలు
4. సీడ్ కం ఫర్టిలైజ్ డ్రిల్లర్	14	రూ. 4.20లక్షలు
5. కల్టివేటర్లు, రోటా పడ్లర్లు	86	రూ. 15.52లక్షలు
6. బండ్ ఫార్మర్ (బోదెల తయారీ)	2	రూ. 0.26లక్షలు
7. పవర్ వీడర్లు	6	రూ. 2.10లక్షలు
8. బ్రష్ కట్టర్లు	5	రూ.1.7లక్షలు
9. పవర్ టిల్లర్ (వరిలో దుక్కి చేసే)	3	రూ. 3లక్షలు
10. సీహెచ్‌సీ ట్రాక్టర్లు	1	రూ. 5లక్షలు
11. కిసాన్ డ్రోన్లు	1	రూ. 5లక్షలు
మొత్తం	397	రూ. 80.92లక్షలు

ముథోల్‌లో ఈదురు గాలులతో వర్షం

ముథోల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని విట్టోలి, తరోడా, వెంకటాపూర్, చించాల, నూపిప్రి, ముద్గల్ గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఆరబెట్టిన పంటల దిగుబడులు తడిసిపోయాయి. అలాగే రైతులు ఈదురు గాలులతో వర్షం కురియడంతో ఆందోళనకు గురయ్యారు. దిగుబడులను తడిసిపోకుండా టార్పాలిన్లను కప్పినప్పటికీ కొన్ని చోట్ల తడిసి పోయాయి. ఈదురు గాలుల కారణంగా మామిడి కాయలు నేలరాలాయి.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.33 (శనివారం సాయంత్రం)

సహర్ : 4.56 (ఆదివారం ఉదయం)

అహంకారంతో విర్రవీగే వారిని, తల్లిదండ్రులతో ఉత్తమంగా వ్యవహరించని వారిని, భయపట్టే వారిని, ఔదార్యంతో మెదలని వారిని అల్లాహ్ ఇష్టపడడు



నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

- జేఆర్‌చౌహాన్ (విద్యుత్ శాఖ సీఈ, ఆదిలాబాద్)



వేసవిలో నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషిచేస్తున్నాం. ఈ యేడు ముందుగానే సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌కింద పనులను చేపడుతున్నాం. గతేడు కంటే ఈసారి విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. అయిన అంతరాయం కలగకుండా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. మండుతున్న ఎండలకు పెరుగుతున్న విద్యుత్‌డిమాండ్‌కు అనుగుణంగానే సరఫరా అయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఈసారి అంచనాలకు మించిన విద్యుత్ వినియోగమయ్యే అవకాశం కన్పిస్తోంది.

పవర్ ఫుల్ డిమాండ్

- జిల్లాలో రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- రోజుకు 2.09 మిలియన్ యూనిట్ల పవర్ యూజ్
- మార్చిలోనే భారీగా పెరిగిపోయిన విద్యుత్ వినియోగం
- సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌ను మొదలు పెట్టిన అధికారులు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

ఆదిలాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈ యేడు వేసవి ప్రారంభంలోనే విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. జిల్లాలో రికార్డుస్థాయిలో 42డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మండిపోతున్న ఎండలకు గృహ వినియోగంతోపాటు వ్యవసాయ, పరిశ్రమల వినియోగం భారీగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు. గడిచిన ఫిబ్రవరిలో జిల్లా వాటా 53.260 మిలియన్ యూనిట్స్ కాగా.. అధికంగా 55.52 మిలియన్ యూనిట్స్‌ల విద్యుత్ వినియోగమైంది. ప్రస్తుతం రోజుకు 1.89 మిలియన్ యూనిట్స్ డిమాండ్ ఉండగా.. 2.09 మిలియన్ యూనిట్స్ వినియోగమవుతుంది. గతేడు ఏప్రిల్‌లో 45.600 మిలియన్ యూనిట్స్ డిమాండ్ ఉండగా.. 49.69 మిలియన్ యూనిట్స్, మేలో 39.790 మిలియన్ యూనిట్స్ డిమాండ్‌కు 44.04 మిలియన్ యూనిట్స్ వినియోగమైంది. ఈ యేడు మార్చి 20 వరకే 41.17 మిలియన్ యూనిట్స్ వినియోగమైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. రాబోయే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని అధికారులు అంచనా వేయలేక పోతున్నారు. గతేడుతో పోల్చుకుంటే ఈ యేడు విద్యుత్ వినియోగం అధికమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2లక్షల 30వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో పెద్దగా యాసంగి పంటల సాగులేకపోవడంతో వ్యవసాయానికి కొంతవరకు డిమాండ్ తగ్గిన గృహ వినియోగమే భారీగా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

- **రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు**

ఈ యేడు మార్చిలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిపోతుంది. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు కూలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీలతో విద్యుత్ వినియోగం పెరిగి బిల్లుల మోత భారంగా మారుతోంది. వేసవిలో బిల్లులు మూడింతలు కావడంతో అదనపు భారం పడుతుందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కరెంట్ బిల్లులను చూసి వినియోగదారులు బిత్తెర పోతున్నారు. ఇదేంటని విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయడంతో విద్యుత్ వినియోగం అధికమవుతుందని అంచనా వేస్తున్నారు. విపరీతంగా మండిపోతున్న ఎండలకు రాత్రీ పగలు విద్యుత్ వినియోగం తప్పనిసరిగా మారింది. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోకుంటే భవిష్యత్‌లో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. వడగాలులు, ఈదురుగాలులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. దీంతో పరిస్థితిని చక్కబెట్టేందుకు అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

- **సరఫరా నిలిచిపోతే ఉక్కిరిబిక్కిరే..**

ప్రతీయేడు మాదిరిగానే ఈ యేడు అధికారులు సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌ను ప్రారంభించారు. ఇప్పటికే పట్టణంతో పాటు పలు గ్రామాలలో విద్యుత్ మరమ్మతులను చేపడుతున్నారు. వర్షాకాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరమ్మతుల కోసం విద్యుత్‌ను తరుచు నిలిపివేయడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కొమ్మకొట్టడం, వంగిన స్తంభాలను నిలబెట్టడం, కొత్త పోల్స్‌ను వేయడం, లూజు వైర్లను సరిచేయడం లాంటి పనులను చేపడుతున్నారు. ఎండలు మరింతగా ముదిరితే సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌కు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. దీంతో మార్చిలోనే దాదాపుగా మరమ్మతు పనులను పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు, ఈదురు గాలులు బీభత్సాన్ని సృష్టించే అవకాశం ఉంది. దీంతో అధికారులు అప్రమత్తమవుతున్నారు. ఈదురు గాలులు, వానలతో చెట్లు విరిగి పడితే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం కష్టంగానే కనిపిస్తోంది. సమ్మర్ యాక్షన్ పనులను మరింత వేగవంతం చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- **మొరాయిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు**

ఎండల తీవ్రతకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయిస్తున్నాయి. దీనికి తోడు ఓవర్‌లోడ్ భారం పెరిగిపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే ఎండల తీవ్రతకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తుల్లో జాప్యం జరుగుతోంది. మరమ్మతుల కోసం రోజుల తరబడి కాలయాపన కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని అధికారుల్లో అయోమయం కనిపిస్తోంది. ఫిబ్రవరి మాసంలో సుమారుగా 40 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు రాగా.. మార్చిలో ఇప్పటివరకు 30కి పైగా మరమ్మతులు చేయాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. పరిమితికి మించిన కనెక్షన్లు పెరిగి పోవడం కూడా ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయించడానికి మరో కారణంగా తెలుస్తోంది. వేసవి సీజన్‌కు అనుకూలంగా ఏర్పాట్లు చేసుకుంటున్న ఎండల తీవ్రతకు ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని సిబ్బంది వాపోతున్నారు.





పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 10,043 మంది విద్యార్థులకు 52కేంద్రాలను ఏర్పాటుచేశారు. పరీక్ష కొనసాగే సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయించారు. పరీక్ష సమయం కంటే గంట ముందు నుంచే విద్యార్థులను లోనికి అనుమతించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏఎన్ఎంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. తొలి పరీక్షకు 10 వేల 13 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరైనట్లు డీఈఓ ప్రణీత తెలిపారు. ఇదిలా ఉంటే పట్టణంలోని విద్యానగర్‌లోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షిషా సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పరీక్ష రాస్తున్న విధానాన్ని పరిశీలించి భయం లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఆయన వెంట శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, అధికారులున్నారు. మరోవైపు పక్క ఎస్పీ అఖిల్ మహాజన్ లిటిల్‌స్టార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలుచేశారు. పరీక్షరాస్తున్న విద్యార్థులను చూసి పలు సూచనలు చేశారు. పరీక్షసమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని పోలీసులకు సూచించారు.

ఉట్నూర్‌లో..

ఉట్నూర్: మండలకేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలలో శుక్రవారం నుంచి ప్రశాంతంగా పదవతరగతి పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఉట్నూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, ఉట్నూర్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలతోపాటు పూలాజీబాబా కాన్సెప్ట్ స్కూల్లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 880మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి పరీక్ష కేంద్రాలను సందర్శించి ఎలాంటి కాపీలకు అవ కాశం ఇవ్వద్దని, పరీక్షలు విద్యార్థులు భాగా రాసుకునేలా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. ఉట్నూర్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల కేంద్రంవద్ద విద్యార్థులను పూర్తిగా తనిఖీలు చేసి సిబ్బంది లోనికి పంపించారు.



ఉట్నూర్‌లోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్



ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌ని సన్మానిస్తున్న సభ్యులు

ఏఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన మానిటరింగ్ కమిటీ సభ్యులు

ఉట్నూర్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సబ్‌డివిజన్ పోలీసు ఏఎస్పీ కాజల్‌సింగ్‌ను ఎస్సీ ఎస్టీ యాక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాటం రమేష్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందించి సన్మానించారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రజల సమస్యలు సానుకూలంగా పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఆయనవెంట సురేష్, ఆతీష్, కేంద్రేరమేష్, సింగారే భారత్, దావులరమేష్ ఉన్నారు.

మాజీ మంత్రిని కలిసిన ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న ఆర్యవైశ్య జిల్లామహాసభ, నూతనకార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా సంఘం నాయకులు మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లాఅధ్యక్షుడు జోగురామన్నను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నార్నూర్ మండలంలో నిర్వహించే వేడుకకు మంత్రికి ఆహ్వానపత్రిక అందించినట్లు చెప్పారు. ఇందులో జిల్లానూతన అధ్యక్షుడు చింతావార్‌రాజేశ్వర్, ప్రతినిధులు జనగం దినకర్, మల్లుర్వార్ చంద్రకాంత్, రాజేశ్, క్రాంతి పాల్గొన్నారు.

నాబార్డు ద్వారా అందించే పైప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి, మార్చి21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాల్గొండ వాటర్‌షెడ్ ద్వారా రైతుల భాగస్వామ్యంతోపాటు నాబార్డు ఆర్థిక సహాయంతో అందించే పైప్‌లతోపాటు హెర్‌గన్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వాటర్‌షెడ్ సమన్వయకర్త ముత్యం, తాజా మాజీసర్పంచ్ కినక జుగాదిరావు అన్నారు. వాల్గొండలోని ఏడుగురు రైతులు తమ వాటా రూ.9,500 చెల్లించిన రైతులకు రూ.30వేల విలువచేసే పైప్‌లు, హెర్‌గన్‌లను శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో రైతు తమ వాటా రూ.9,500 చెల్లించారని వారికి ఒక్కొక్కరికి 25 పైపులు, రెండు హెర్‌గన్‌లను కొనుగోలు చేసేందుకు నాబార్డు నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో వాల్గొండ షెడ్ రైతులు పాల్గొన్నారు.



రైతులకు పైపులు, హేర్‌గన్‌లు అందజేస్తున్న దృశ్యం



రైతు గుండెకు టమాట ధరల పోటు

- మార్కెట్‌లో రూ.3కు పడిపోయిన కిలో టమాట ధర
- దక్కని లాభం.. ఆశలు ఆవిరి
- విస్తీర్ణం పెరిగినా.. ప్రయోజనం శూన్యమే
- అధిక ఖర్చులతో మరింత భారం
- కొనుగోళ్లు లేక పారవేస్తున్న నిర్మల్ జిల్లా అన్నదాతలు

7

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

ఆదిలాబాద్ అర్బన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి):పర్యావరణ పరిరక్షణ కోసం అడవులు ఎంతగానో దోహదపడుతాయని, అటవిని రక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఎఫ్ఆర్ఓ గులాబ్‌సింగ్ అన్నారు. అంతర్జాతీయ అటవి దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎఫ్ఓ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అటవి రక్షణ నినాదాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ అడవులు ప్రజకు ఆక్సిజన్, పండ్లు ఇస్తాయన్నారు. దీన్ని కాపాడాల్సిన బద్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అడవిలో నిప్పు చెలరేగిన, చెట్లను ఎవరు నరికిన వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అటవీ అధికారులు ప్రమోద్‌కుమార్, అహ్మద్‌ఖాన్, గులాబ్, ధన్‌సింగ్, సవిత, జ్యోతి, జ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: అడవుల సంరక్షణలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఎఫ్ఆర్వో సంతోష్ అన్నారు. అంతర్జాతీయ అట వీ దినోత్సవాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖ బీట్ ఆఫీసర్ జాదవ్ కృష్ణ, రాథోడ్ జ్యోతి, జాదవ్ అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వికాసం విద్యార్థులకు వినికిడి యంత్రాలు

- ఆశ్రయ్ ఆకృతి సేవలు ప్రశంసనీయం: పీఓ

ఉట్నూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వికాసం ప్రత్యేక అవసరాలు గల బాలబడి విద్యార్థులకు వినికిడి యంత్రాలు అందించిన ఆశ్రయ్ ఆకృతి సేవలు ప్రశంసనీయమని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలోఉన్న వికాసం పాఠశాలలోని 30మంది విద్యార్థులకు సుమారు రూ.18లక్షలతో వినికిడి లోపం ఉన్న విద్యా ర్థులకు వినికిడి యంత్రాలు ఉచితంగా సమకూర్చడం కోసం ముందుకు రావడం ఈ ప్రాంత విద్యార్థులు అదృష్టమని అన్నారు. వినికిడి యంత్రాల ద్వారా విద్యార్థులకు కొత్త అనుభూతి ఏర్పడుతుందని అన్నారు. ఈ యంత్రాల పని తీరును గమనిస్తూ ఉండాలని ఏవైనా మరమ్మత్తులు అవసరమైతే ఎలా చేయాలో తెలుసుకోవాలని వికాసం పాఠశాల ప్రిన్సిపాల్ వికాస్‌ను ఆదేశించారు. అవసరమైన విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా కూడా కొనుగోలు చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాల పిల్లలకు సేవ చేయడానికి ముందుకు వచ్చిన వారికి అండగా ఉంటామని ఖుష్బుగుప్తా అన్నారు. ఈ సందర్భంగా ఆశ్రయ్‌ఆకృతి సంస్థ ప్రతినిధులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పీవీటీజీ ఏపీఓ మేస్రం మనోహర్, ఐటీడీఏ పరిపాలన అధికారి దామోదర్‌స్వామి, మేనేజర్ శ్యామల, ఆశ్రయ్ ఆకృతి ఎండీ డీపీకే బాబు, కో ఆర్డినేటర్ జయంత్, వాణిశ్రీ, ఏటీడీఓ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోయపున్నెంగోండ్వాణ రాయి దర్బార్ కరపత్రాలను విడుదల చేసిన పీఓ

ఈనెల 28న ఉట్నూర్ మండలం మత్తడిగూడ గ్రామంలో జరుగనున్న కోయపున్నెంరాయ్‌సభ గోండ్వాన దర్బార్ కరపత్రాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆవిష్కరించారు. ఆదివాసీ గిరిజన ప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఆదివాసులు పాల్గొని తమ గ్రామ దేవతలు, వందదేవతలు, కుటుంబ దేవతలు పేర్లు నమోదు చేసుకోగలరన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు పేన్‌పటేల్, కటోడల్ దేవారిలు అందరు హాజరుకాగలరని ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఏటీడబ్ల్యుఏసీ చైర్మన్ సిడాం భీమావు మాట్లాడుతూ ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాజ్‌గోండు సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందోర్ ప్రభాకర్ మాట్లాడుతూ కార్యక్రమానికి ప్రజలు అందరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గేడాంనీరంజన్, మడావిబాలాజి తదితరులు పాల్గొన్నారు.



వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీఓ

సహకార సొసైటీలో కర్షక మిత్ర రుణాలు

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

తాంసి, మార్చి21 (ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీ కర్షకమిత్ర రుణాలను అందిస్తున్నామని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని సహకార సొసైటీలో పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందిస్తున్నామన్నారు. కర్షకమిత్ర పథకం ద్వారా ఎకరానికి 2లక్షల చొప్పున మొత్తం 10లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. ఈ రుణాలకు 12శాతం వడ్డీవసూలు చేస్తామని పేర్కొన్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద 2018వ ఏడాది వరకు మొండిబకాయిలు ఉన్న రైతులందరికీ 50శాతం రుణాలు చెల్లిస్తే తిరిగి కొత్తరుణాలు అందిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని సహకార సంఘాలలో రైతులకు రుణాలతోపాటు గృహరుణాలు కూడా అందిస్తున్నామన్నారు. ప్రతీ రైతు సహకారసొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే రెట్టింపు రుణాలు అందిస్తామన్నారు. తాంసి సహకారసొసైటీ చిన్నది అయినప్పటికీ ఇప్పుడిప్పుడే లాభాల్లోకి వెళుతుందన్నారు. కార్యక్రమంలో సీఈఓ కేశవ్, సొసైటీ ఉపాధ్యక్షుడు ధనంజయ్, సభ్యులు సంతోష్ రెడ్డి, రమేష్, బుజ్జన్న, గంగమ్మ, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు

- జీసీసీఎం ఎస్ చైర్మన్

ఉట్నూర్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాథమిక కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఉట్నూర్ శాఖ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఉట్నూర్ జీసీసీఎంఎస్ చైర్మన్, ఇన్‌చార్జీ మేనేజర్ రామానందం అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జీసీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు సేకరించే ఇప్పపువ్వు కొనుగోలు కోసం నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం ఇది వరకే ప్రకటించిన మద్దతుధర కిలో రూ.30 చొప్పున కొనుగోలు చేస్తామని, గిరిజనులు తాము సేకరించిన ఇప్పపువ్వు దళారులకు అమ్ముకోకుండా సంస్థ డీఆర్‌డీపోలలో విక్రయించి లబ్ధిపొందాలన్నారు. ఇటీవల గిరిజన సహకార సంస్థఆధ్వర్యంలో గోదాములో జరిగిన అగ్నిప్రమాదంలో రూ. 13.60లక్షల విలువ గల గోనె సంచులు దగ్ధం అయ్యాయని అన్నారు. ఈ ఘటనలో ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామని, పూర్తి నివేదికను కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు సమర్పించామన్నారు. డీఆర్‌డీపోల ద్వారా మరిన్ని సేవలు అందుబాటులోకి తేవాలని డైరెక్టర్లు సూచించారు. సమావే శంలో డైరెక్టర్లు శాంతాబాయి, తుకారం, రాదాబాయి, ఆర్.గోవిందావు, ఎస్. దేవరావులతోపాటు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

మావల, మార్చి21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్‌సీస్ మ్యానర్ పవర్ కంపెనీలో పనిచేయడానికి ఈ మేళానిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో వివిధ ట్రేడ్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయడానికి కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఇంటర్వ్యూకి హాజరయ్యే అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఐటీఐ, క్యాస్ట్, ఆధార్ కార్డుతో పాటు రెండు పాస్‌ఫొటోస్, బయోడేటా ఫారంతో రెండు జతల కాపీలతో హాజరు కావాలని తెలిపారు.

ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి

బోథ్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఇంటికి బోరుబావి సమీపంలో ఇంకుడు గుంతను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో రమేష్ కోరారు. శుక్రవారం మండలంలోని నేరేడుపల్లి, చింతగూడ గ్రామాలలో పర్యటించి బోరుబావులను పరిశీలించారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరుబావుల వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పెంపునకు ఇవి ఎంతగానో ఉపయోగకరిస్తాయని వివరించారు. ఆయన వెంట ఎంపీ ఈవో ఏఈలు ఉన్నారు.